

లెక్కే లేదు అమలు ఇంకెక్కడ?



వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఉన్న సిబ్బంది అన్ని మున్సిపాలిటీలకు అందుబాటులో లేరు. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె పట్టణాల్లో వీధి కుక్కలను పట్టుకోవాలంటే మంగళగిరి ప్రాంతంలో ఉన్న కొద్దిమంది డాగ్ హ్యాండ్లర్లు, క్యాచర్లను ఆశ్రయించాలి. రాష్ట్ర మున్సిపల్ శాఖ శిక్షణ పొందిన డాగ్ క్యాచర్లను నియమించుకోవాలని ఆదేశాలిచ్చినా నియామకాలు జరగలేదు.

ఆపరేషన్లు చేశాక వీధి కుక్కలను కనీసం నాలుగు రోజులు అదే కేంద్రాల్లో సంరక్షించాల్సి ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో నిధుల కొరత ఉంటే, మరికొన్నింటిలో వాటికి వెచ్చించాల్సిన నిధులు మింగేసిన పరిస్థితి ఉంది. దీంతో కొన్ని కేంద్రాల్లో ఉంచిన కుక్కలు అక్కడే చనిపోయిన దారుణ పరిస్థితులూ ఉన్నాయి. ఇందుకోసం.. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించింది. ఏ మున్సిపాలిటీలో నిధుల మిగులు లేవు.



బల్లికురవలో గుంపులు గుంపులుగా రోడ్ల వెంబడి ఉన్న కుక్కలు



సత్తెనపల్లి: కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు

- మొక్కుబడిగా వీధి కుక్కల బెడద నియంత్రణ
- 'స్థానిక'ంగా పక్కాగా లేని శునకాల లెక్క
- స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అంతంత మాత్రమే..
- సుప్రీం గడువు దాటినా..కమిటీలతోనే సరి..
- అలసత్వం, ఆటంకాలు, నిధుల కొరత..



బాపట్ల, అద్దంకి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వీధి కుక్కలు ఇంకా రోడ్లపై గుంపులుగా చేరి మొరుగుతూనే ఉన్నాయి. జనం పిక్కల బలానికి పరీక్షలు పెడుతూనే ఉన్నాయి. కుక్కకాటుతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్యలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. వీధి కుక్కల కారణంగా ఎవరి ప్రాణాలకు హాని కలగకూడదని, వాటి నియంత్రణ, జన సమూహాల్లో సంచారం లేకుండా చూడాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన రెండు వారాల గడువు పూర్తయిపోయింది. చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాల సీఎస్‌లనే బాధ్యులను చేస్తామని కూడా స్పష్టం చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పరిశీలిస్తే.. ఒకటి, రెండు పురపాలికల్లో మినహా కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. స్టెరిలైజేషన్, ఆహారం అందించేందుకు ఒక్కో వీధి కుక్కకు రూ.1,650 ఖర్చు చేయాలని, ప్రత్యేక కమిటీల సాయంతో వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటూ (మిగతా 8వ పేజీలో)



వాట్సాప్‌తో కొనుగోళ్లు

- హాయ్ అంటే ఏఐ సహకారం
- సేకరణను సులభతరం చేసే దిశగా అడుగులు
- బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేంద్రాలు ప్రారంభం
- నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో కొనుగోళ్లకు ఏర్పాట్లు

రైతుల కోసం వాట్సాప్ నెంబర్ 73373 59375

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోళ్లను సులభతరం చేసే దిశగా ప్రభుత్వం సాంకేతిక సేవలను ఉపయోగించుకునే విధానానికి తెరతీసింది. రైతుల కోసం వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 7337359375 నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే చాలు వెంటనే ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ వాయిస్‌తో తదుపరి ప్రక్రియపై రైతులకు మార్గనిర్దేశనం చేస్తుంది. అన్నదాతలు వాట్సాప్ వేదికగా ఇచ్చే వివరాలతో కొనుగోలు స్లాట్ బుక్ కానుంది. వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే రైతుల ధాన్యాన్ని కొనుగోలు నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవరకు సాంకేతిక బృందం పర్యవేక్షణ కొనసాగనుంది. ఓ వైపు కొనుగోలు కేంద్రాలను తెరుస్తూనే, మరో వేదికగా వాట్సాప్ సేవలను కూడా రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మద్దతు ధరకు (మిగతా 8వ పేజీలో)

బాపట్ల జిల్లాలో 2 లక్షల టన్నులు

బాపట్ల జిల్లాలో మంగళవారం 5 కొనుగోలు కేంద్రాల సేవలను అందుబాటులోకి తెచ్చిన సివిల్ సప్లయిస్ విభాగం బుధవారం 117 కేంద్రాలను ప్రారంభించింది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. గతేడాది 93,000 మెట్రిక్ టన్నుల సేకరించగా, ఈ ఏడాది ఏకంగా రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేసింది.

గుంటూరులో లక్ష టన్నులు

గుంటూరు జిల్లాలో బుధవారం నుంచి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత 5 రైతు సేవా క్లస్టర్లను ఓపెన్ చేసి, వారం వ్యవధిలో 45 క్లస్టర్లలో కొనుగోళ్ల జరిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో లక్ష టన్నుల వరకు సేకరించేలా ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

దుకాణాలు తొలగించవద్దు

సూర్యలంక తీర దుకాణదారుల డిమాండ్

నోటీసులు అందజేసిన పంచాయతీ అధికారులు

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలోని దుకాణాలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జారీ చేసిన నోటీసులు ఇవ్వడానికి బుధవారం వచ్చిన కార్యదర్శి రవికుమార్‌ను దుకాణదారులు అడ్డుకుని వెనక్కి పంపించారు. అనంతరం వారంతా ఆందోళనకు దిగారు. తాము దశబ్దాల తరబడి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని దుకాణాలను తొలగించవద్దని డిమాండ్ చేశారు. తీరం ఎదురు రోడ్డుకు ఇరువైపుల సుమారు 50 దుకాణాలకుపైగా ఉన్నాయి. టూరిజం డెవలప్‌మెంట్ పనులకు దుకాణాలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలిగించాలని పంచాయతీ అధికారులు ఆదేశించారు. 39 దుకాణాలకు నోటీసులు జారీ చేయగా వాటిని దుకాణదారులు తీసుకోలేదు. తమ దుకాణాలు తొలగించ వద్దని పంచాయతీకి ప్రత్యేకాధికారిగా ఉన్న తహసీల్దార్ షేక్.సలీమాను కలిసి వినతిపత్రం అందజేశారు. తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తే అందులోకి వెళ్తామని, ఆ తర్వాత టూరిజం శాఖ నిర్మించే దుకాణాలు తమకు ఇప్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ తెలిపారు.



సూర్యలంక తీరంలోని వ్యాపార దుకాణాలు



బాపట్లలో మహిళా రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి



మార్టూరులో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ఉద్దేశం

- ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం
- సుఖీభవ నిధుల విడుదలలో మంత్రి పార్థసారధి

బాపట్ల, బాపట్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమం బుధవారం బాపట్ల మండలం ఈస్ట్‌బాపట్ల రైతు సేవా కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రైతుల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యమన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలు, బిందుసేద్యం పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నగదు కోసం రైతులు రోడెక్కాల్సి వచ్చిందని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లిస్తుందన్నారు. వ్యవసాయంలో డ్రోన్లను ఉపయోగించి రైతులకు ఖర్చు తగ్గించే పని చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతన్నలకు అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, పంగులూరి శ్రీనివాసరావు, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పండగలా కార్యక్రమాలు

అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగాయి. చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన పాల్గొన్నారు. మార్టూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులతో కలిసి హాజరవ్వగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు చుండూరులో జరిగిన అన్నదాత సుఖీభవ నిధుల విడుదలలో పాల్గొన్నారు. చీరాల మండలం బోయనవారిపాలెం, అద్దంకిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో కలిసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పండగ వాతావరణంలో కార్యక్రమాలు జరుపుకున్నారు.

ఆస్పత్రిలో పనులు వేగంగా చేపట్టాలి

- బాపట్ల, ఈపూరుపాలెంలో ఆటిజం కేంద్రాలు
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ వీ వినోద్‌కుమార్



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రూ.23.75 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వైద్య విధాన పరిషత్ ఆధీనంలో జరుగుతున్న పనులతో పాటు జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్, క్రిటికల్‌కేర్ యూనిట్ పనుల్లో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. చీరాల, బాపట్ల ప్రాంతీయ వైద్యశాలల్లో ఆర్థిక సంఘం నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రుల్లో ప్రజలకు అన్ని సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌ను 2026 మేకి పూర్తి చేయాలన్నారు. బాపట్లలోని ఉన్నత పాఠశాలలో, చీరాల ఈపూరుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటిజం కేంద్రం ఏర్పాటుకి అనుమతులు వచ్చాయన్నారు. భవిత కేంద్ర ఏర్పాటుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అలసత్వం వహించరాదు..

అభివృద్ధిలో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని, ఆలసత్వం ప్రదర్శించరాదని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. ఓడరేవు - చిలకలూరిపేట 167ఏ జాతీయ రహదారి నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు-నిజాంపట్నం జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలన్నారు. నిడుబ్రోలు నుంచి చందోలు వరకు రూ.8కోట్లతో 4.6 కిలోమీటర్లు నిర్మిస్తున్న రహదారిని త్వరగా పూర్తి చేయాలన్నారు. రేపల్లె-నిజాంపట్నం, చందోలు-నిజాంపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గుంటూరు నుంచి బాపట్ల వరకు నాలుగు వరుసల రహదారి నిడుబ్రోలు మీదగా బైపాస్ ఉండేలా ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యలంకబీచ్‌లో పనులు వేగంగా చేపట్టాలని తెలిపారు. సూర్యలంక నగరవనం వద్ద బోట్లు పార్కింగ్‌కు అటవీశాఖ అనుమతులను పరిశీలించాలన్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి కాకపోవడంపై ఆరాతీశారు. సమావేశాల్లో వైద్యవిధాన్ పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి, మత్స్యశాఖ ఏడీ గాలిదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి ఆలయానికి

ఐఎస్‌వో గుర్తింపు

- అవార్డును అందజేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శక్తిక్షేత్రాలలో ప్రముఖ ఆలయంగా విలసిల్లుతున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఇంటర్నేషనల్ ఐఎస్‌వో 9001 గుర్తింపు లభించింది. ఇందుకు సంబంధించిన అవార్డును బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్‌వో గుర్తింపు జిల్లాకే తలమానికమని, అవార్డును తాను దేవస్థానానికి అందజేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. హైమ్ ఇంటర్నేషనల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీబగళాముఖి అమ్మవారికి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి చైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కేశరాజు పట్టాభిరామరావు, వక్కలగడ్డ ప్రసాద్, పూజరులు పాల్గొన్నారు.



ఐఎస్‌వో 9001 అవార్డు అందుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తదితరులు

రక్తికట్టిన రాచగావు

- ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు



ఎర్రజెండాను ఎగరవేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

రాగిశాసనంలో... శ్రీశైలం మెట్లు

8

24న క్రోసూరులో జాబ్ మేళా

క్రోసూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాల్‌టెక్నిక్ కళాశాలలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, అభ్యర్థుల అర్హతను బట్టి రూ.15 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసులోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల నకళ్లతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7779858789, 8074393466 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ పురుగు మందులు సీజ్

గురజాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కలలో 10 బాక్సుల నకిలీ పురుగు మందులను పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం గురజాల పోలీసులు దాడులు నిర్వహించి ఓ గృహంలో నిల్వ ఉంచిన పురుగుల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. ప్రముఖ పురుగు మందుల కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందులు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని చెప్పారు. వీరికి సరఫరా చేస్తున్న తెలంగాణకు చెందిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వాహన మరమ్మతులపై ఉచిత శిక్షణ

గుంటూరు విద్య నవంబరు 19 ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వాహన మరమ్మతులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) కో-ఆర్డినేటర్ సాయి వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఆధార్, పదవ తరగతి మార్కుల జాబితా ఇతర వివరాలతో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ కళాశాల)లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 73868 85639 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

న్యూ కేటగిరి విజేత ప్రకాశం జిల్లా ఎడ్ల జత


విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నూతన బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న బుధవారం న్యూ కేటగిరి విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని, ప్రారంభించారు. ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత బండను నిర్ణీత సమయంలో 5,051 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 5 వేల అడుగులతో రెండో స్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన జీపీ చౌదరి, లక్ష్మీ దీక్షిత్ చౌదరి ఎడ్ల జత 4,679 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజస్వి మురళి కునాల రామకోటయ్య ఎడ్ల జత 4,304 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన వెదురుపల్లి శ్రీనివాసరావు, శాకమూరి విజయ పవన్ కుమార్ ఎడ్ల జత 4,288 అడుగులతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా పెదనందిపాడు మండలం రాజుపాలేనికి చెందిన డప్పెలపూడి వినోద్ కుమార్, మాచవరానికి చెందిన కేవీఆర్ బుల్స్ సంయుక్త ఎడ్ల జత 4250 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, సర్పంచ్ సరస్వతి బాలు నాయక్, సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, రైతు సంఘం నేతలు బహుమతులు ప్రదానం చేశారు.

శబరిమలలో గుండెపోటుతో ఇప్పటం వాసి మృతి

● మంత్రి లోకేశ్ సహకారంతో గ్రామానికి చేరిన మృతదేహం


భార్య, పిల్లలతో వెంకటకృష్ణ (ఫైల్‌ఫోటో)

తాడేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటి వారితో కలిసి శబరిమలై అయ్యప్ప దర్శనానికి వెళ్లిన తాడేపల్లి మండలం ఇప్పటం వాసి గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన వీరంకి వెంకటకృష్ణ తోటివారితో కలిసి అయ్యప్ప స్వామి దర్శనానికి (మాల వేసుకోలేదు) ఈ నెల 16న శబరిమలై యాత్రకు వెళ్లాడు. 17న పంబ నదిలో స్నానం చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడని తోటివారు తెలిపారు. టీడీపీ ఇప్పటం గ్రామ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ చొరవ చూపించి వెంకటకృష్ణ (35) మృతదేహాన్ని బుధవారం అంబులెన్స్ ద్వారా శబరిమలై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. మృతునికి వ్యవసాయం జీవనాధారం కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు, పలువురు నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు మృతదేహానికి నివాళులర్పించి అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రశ్నపత్రంలో పొరపాట్లు పునరావృతం కాకూడదు

ఏఎన్‌యూ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏఎన్యూ పరిధిలో జరిగే పీజీ ప్రశ్నపత్రాల రూపకల్పనలో మరోమారు పొరపాట్లు దొర్లకూడదని రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ సంబంధిత ఉద్యోగులకు సూచించారు. వర్సిటీ పరిధిలో ఈ నెల 18న పీజీ పరీక్షలకు సంబంధించి సైన్స్ ప్రశ్న పత్రం చేతిరాతతో విద్యార్థులకు ఇవ్వడంపై విద్యార్థుల నుంచి నిరసన వ్యక్తమైంది. దీనిపై బుధవారం రెక్టార్ పీజీ పరీక్షల సమ న్వయకర్త విభాగం ఉద్యోగులను తన కార్యాలయానికి పిలిపించుకొని ఆరాతీశారు. చేతి రాతతో కూడిన ప్రశ్న పత్రాలను ఇవ్వడంపై ఆయన ఉద్యోగుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం


ఫార్మసీ వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల కీలక పాత్ర పోషిస్తున్నారని అచార్య నాగార్జున యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో బుధవారం ఫార్మా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథిగా వీసీ ప్రారంభించారు. ప్రొఫెసర్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం పాల్గొన్నారు. డాక్టర్ కేవీ ప్రవల్లిక మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఫార్మసీ కళాశాల ఆచార్యులు ప్రొఫెసర్ తేజోమూర్తి, ఎన్‌పీడబ్ల్యూ కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్. మస్తానమ్మ వారం రోజులు నుంచి నిర్వహిస్తున్న వివిధ రకాల పోటీలను క్లుప్తంగా వివరించారు. ప్రొఫెసర్ దేవినేని జ్యోతిర్మయి, ర్యాంకింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రవి పరిమి, డాక్టర్ కె.విజయ్ కిషోర్, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల తనిఖీ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షలను రెండవ రోజు సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తనిఖీ చేశారు. వర్సిటీ బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సమర్థంగా పరీక్షల నిర్వహణకు పరిశీలకులతో పాటు.. మూడు తనిఖీ బృందాలను నియమించామని చెప్పారు.

న్యాయవిద్యార్థులకు అభినందన..

విశాఖలో జరిగిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విద్యార్థులను తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్‌రావు తన కార్యాలయంలో అభినందించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి తోడ్పాటుతో సదస్సులో న్యాయపరమైన కంపెనీల పెట్టుబడుల కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూడగలిగామని విద్యార్థులు వీసీకి వివరించారు.

పెదకాకాని మల్లేశ్వరస్వామి సేవలో.. మంత్రి సుభాష్


రాహు కేతు పూజలో మంత్రి సుభాష్

పెదకాకాని, నవం బరు 19 (ఆంధ్ర జ్యోతి): పెద కాకానిలోని గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వా మి దేవస్థా నాన్ని రాష్ట్ర కార్మి క శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం దర్శించారు. మంత్రికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపిం చారు. రాహు కేతులకు పూజలు చేయించారు. అర్చకస్వా ములు వేద ఆశ్వీరవచనం అందజేసి, శ్రీస్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి ప్రసాదం, చిత్ర పటం బహూకరించారు.

దుకాణంలో పేలుడు..


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చెరుకుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుంబాకలో గల ఓ దుకాణంలో బుధవారం జరిగిన పేలుడుతో సమీప ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. పేలుడు ధాటికి దుకాణం రేకులు సుమారు 100 మీటర్ల దూరం వరకు ఎగిరి పడ్డాయి. పోలీసుల కథనం ప్రకారం.. నేల టపాసులు తయారు చేయడానికి ఉపయోగించే మందును దుకాణంలో యజమాని పెట్టారు. ఉదయం అతని భార్య దుకాణం తీసి దేవుడి దగ్గర సాంబ్రాణి కడ్డీలు వెలిగించి బయటకు వచ్చింది. ప్రమాదవశాత్తు కడ్డీలు టపాసుల మందులో పడటంతో పేలుడు సంభవించింది. విజయవాడలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసులు క్లూస్‌టీంతో చేరుకుని.. ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో ఆర్థికాభివృద్ధి

● సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమాండర్ శ్రీవాస్తవ్


మాట్లాడుతున్న కమాండర్ సబ్యసాసి శ్రీవాస్తవ్

బాపట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమాండర్ సబ్యసాసి శ్రీవాస్తవ్ అన్నారు. బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన దీక్షారంభ్ 9వ రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారతదేశంలో వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు 50 శాతానికి పైగా మద్దతునిలుస్తుందన్నారు. యుద్ధ వీరుడు సాథాన్‌సింగ్ భాటి యదార్థగాధను వివరించారు. ప్రస్తుత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాతావరణ మార్పులు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు దేశ వ్యవసాయోత్పత్తిని పెంచే సామర్థ్యం కలిగిన భవిష్యత్తు అగ్రి ప్రొఫెషనల్స్‌గా ఎదిగి సమాజానికి సేవ చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఎం.శ్రీరేఖ, డాక్టర్ ఎం.సంధ్య, డాక్టర్ డి.రమేష్ పాల్గొన్నారు.

పాపకు పింఛను ఇప్పించండి సారూ..


కలెక్టర్‌కు విన్నవిస్తున్న పాప తల్లి లక్ష్మి

బాపట్లరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ బాపట్ల పంచాయతీలోని రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమంలో బుధవారం కలెక్టర్ వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో హైదర్‌పేట గ్రామానికి చెందిన నూతలపాటి స్మయిలి అనే 13 ఏళ్ల పాపకు పింఛను ఇప్పించాలని తల్లి నూతలపాటి లక్ష్మీ కలెక్టర్‌కు విన్నవించారు. పాప పుట్టుకతోనే మానసికంగా, శారీరకంగా దివ్యాంగురాలని వివరించారు. పాపకు ఇప్పటి వరకు పెన్షన్ రావడం లేదని కలెక్టర్ విన్నవించుకున్నారు. ఈ విషయంపై సంబంధి అధికారులను కలెక్టర్ వివరణ కోరారు. పాప ఆధార్ కార్డులో లోపాలు ఉండటం వల్ల సదరన్ స్లాట్ అవ్వడం లేదని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పాపకు పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

యథేచ్ఛగా బుసక తవ్వకాలు


నిల్వ ఉంచిన బుసక తవ్వకాలు..

నగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరమాదిగపల్లిలో బుసక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమంగా నిల్వ ఉంచి మరీ.. వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో.. ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అతి వేగంగా వాహనాలు నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పొలాలు, దిబ్బలు వీలైనంతగా తవ్వి, గుట్టలు పేర్చుకుని అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. బుసక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అక్రమాలకు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

26న జడ్పీ స్థాయి సంఘ సమావేశం

గుంటూరు సిటీ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆరవ స్థాయి సంఘం సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సీఈవో వీర్ల జ్యోతిబసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ఛైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సంక్షేమం, కార్పొరేషన్లు, డీఆర్డీఏ, డ్వామా, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

యడ్లపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం గ్రామ పరిధిలోని పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని చెరువు కట్టపై ముళ్ల పొదల చాటున పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. రూ.10,240లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

శ్రీగంధం చెట్లు చోరీ

రొంపిచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామ సమీపంలో శ్రీగంధం చెట్లను దుండగులు రెండు రోజుల క్రితం నరికి దుంగలను తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఇంటూరి చిన వెంకటరావు సుమారు మూడున్నర ఎకరాల్లో ఎర్రచందనం, శ్రీగంధం చెట్లను సాగు చేస్తున్నారు. 150 మొక్కలను పెంచుతుండగా 25 శ్రీ గంధం చెట్లను దొంగలించారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షల మేర ఉంటుందని బాధితుడు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వాట్సాప్ కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

ధాన్యం అమ్ముకునే విషయంలో ప్రతీ సీజన్‌లోనూ రైతుల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతూనే ఉంటాయి. ఈ క్రమంలో అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వాట్సాప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ పెట్టిన తర్వాత ఏఐ వాయిస్ ఇచ్చే సూచనలను రైతులు పాటించాల్సి ఉంటుంది. ఆధార్ నంబరు ఎంటర్ చేసిన తర్వాత రైతు తన పేరును ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఏ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్మాలనుకుంటున్నారో తెలియపరచడంతో, విక్రయానికి సంబంధించి ఇచ్చే మూడు తేదీలలో ఓ దానిని రైతు ఎంపిక చేసుకునే వీలు కూడా కల్పించారు. ఇక ఏ రకం ధాన్యం, పరిమాణం ఎంత అనే వివరాల కోసం ప్రత్యేక ఆప్షన్ వాట్సాప్ ద్వారానే ఇవ్వనున్నారు. తర్వాత ప్రక్రియగా అమ్మకం తేదీ ఖరారు, షెడ్యూల్ బుక్ అయినట్లు స్లాట్ కూపన్ వాట్సాప్ ద్వారానే రైతుల దరికి చేరేలా టెక్నాలజీని ప్రభుత్వం డిజైన్ చేసింది. ఈ విధానంలో అన్నదాతలకు సమయం ఆదాతో పాటు ఖర్చులూ తగ్గనున్నాయి.

పల్నాడులో 286 కేంద్రాలు

ఈ నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 286 రైతు సేవా కేంద్రాల ద్వారా 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. మూడు జిల్లాల పరిధిలోనూ గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే కొనుగోళ్ల లక్ష్యాన్ని దాదాపుగా రెట్టింపు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెదకాకాని, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పెద కాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన తిరుక్కోవల్లూరి సాంబమూర్తి పేరు మీద భార్య శోభ రూ. 50,116, గుంటూరుకు చెందిన నందిగామ సాంబశివరావు, నర్రా రామమూర్తి, గింజుపల్లి గోపాల్ స్వామి పేరు మీద నందిగామ శిరీష, ప్రసాద్ రెడ్డి దంపతులు రూ.50 వేలు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ జి. లీలాకుమార్ బుధవారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

50,247 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 52,346 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,247 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 14,006 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	14300
334	10000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	16000	334	10500	17500
273	10500	14500	నెంబరు. 5	12000	16500
341	10000	17500	341	12000	18000
4884	----	----	4884	11000	14600
సూపర్ 10	----	----	సూపర్ 10	10500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	11000	16000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18200	దేవనూరు డీలక్స్	10500	17700
దేవనూరు డీలక్స్	10500	17500	తాలుకాయలు	5000	9000

కుక్కల నియంత్రణకు నామమాత్రపు చర్యలు

● వీధుల్లో కుక్కలు స్వైరవిహారం



బాపట్ల రైల్వేస్టేషన్ రోడ్డులో కుక్కల స్వైరవిహారం

బాపట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కలబెడద నానాటికి పెరిగిపోతూనే ఉంది. మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో ఏ వీధి చూచిన కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రించేందుకు రైలుపేట శ్మశానవాటికలో శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు రూ.6 లక్షలు వెచ్చించి షెడ్, బోన్‌లు, ఏసీ, ఆపరేషన్ పరికరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 1000 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 800 కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లు రికార్డులలో నమోదు చేశారు. అయినప్పటికి వీధులలో కుక్కలు పిల్లలు పెడుతూనే ఉన్నాయి. రాత్రి 10 దాటితే వీధుల్లో వెళ్ళే వాహనాల వెంటపడి వాహనచోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సూర్యలంకరోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, జీబీసీ రోడ్డు, జమ్ములపాలెంరోడ్డు తదితర ప్రాంతాలలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం ఆ దిశగా ఏ ఒక్క పని చేయలేదు. ఈవిషయమై శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్‌ను వివరణ కోరగా స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత షెల్టర్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



డ్రైనేజి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి తదితరులు

డ్రైనేజి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించిన కమిషనర్

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 34వ వార్డు కృష్ణమందిరం పరిసరాలలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి బుధవారం సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆప్రాంతంలో ఎంతోకాలంగా డ్రైనేజి వ్యవస్థ సరిగ్గా లేక మురుగునీరు పారుదల లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. వెంటనే మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని పిలిచి డ్రైనేజి నిర్మాణానికి తక్షణమే అంచనాలు సిద్ధం చేసి అత్యవసరంగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో మురుగునీటి చెరువు పూడ్చే పనులను పరిశీలించారు. చెరువు పక్కన ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జమ్ములపాలెం విద్యార్థుల ఎంపిక

బాపట్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ హాకీ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటకృష్ణారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ -14 బాలురు, బాలికలు నవంబరు 22 నుంచి 25 వరకు తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఎంపికైన విద్యార్థులు నవంబరు 27 నుంచి 29 వరకు కడపజిల్లా పులివెందలలో జరిగే పోటీలలో పాల్గొనటం జరుగుతుందన్నారు. అదేవిధంగా అండర్-17 బాలికల విభాగంలో ఎంపికైన విద్యార్థినులు నవంబరు 27 నుంచి 29 వరకు నెల్లూరు జిల్లా విక్రమ సింహపూరి విశ్వవిద్యాలయంలో జరిగే పోటీలలో పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బోయిన వీరచంద్ర, పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో చెరువుజమ్ములపాలెం ప్రధానోపాధ్యాయులు వి.వెంకటకృష్ణారావు తదితరులు

విన్నకోటను సన్మానించిన కూటమి నాయకులు

బాపట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పీ4 కమిటీ సభ్యుడిగా నియమితులైన జనసేన పార్టీ నాయకుడు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్‌ను బుధవారం కూటమి నాయకులు సన్మానించారు. విజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్ చేస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా పీ4 ద్వారా మరిన్ని సేవలు విస్తరింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటి వైస్ ఛైర్మన్ వై.భూపతిరావు, టీడీపీ సీనియర్ నాయకుడు శీలం శ్రీనివాసరావు, జనసేననాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, గరిగంటి శ్రీనివాసరావు, అంకిరెడ్డి సుకుమార్, చిలకల సురేంద్ర ఉన్నారు.



జనసేనపార్టీనాయకుడు విన్నకోట సురేష్‌ను సన్మానించి మొక్క అందజేస్తున్న కూటమినాయకులు

ఉపాధ్యాయురాలు యాతం సౌజన్యను అభినందించిన మంత్రి లోకేశ్



యాతం సౌజన్య

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వృక్షనగర్ ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న యాతం సౌజన్యను విద్యా, ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ అభినందించారు. దీక్షా ఫ్లాట్‌ఫారమ్‌లో ఈ-కంటెంట్ తయారు చేయటం ప్రశ్నాపత్రాలు తయారీ, టీచర్ హ్యాండ్‌బుక్ రాయటం, వినూత్న విద్యాబోధన, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎలా తయారు చేయాలి? కిట్లు ఎలా ఉపయోగించుకోవాలి? అనే అంశాలపై చేసిన వీడియోలను ఉపాధ్యాయురాలు సౌజన్య టీఎల్ఎం అనే యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేసి కోట్లాది మందికి చేరుస్తున్నందుకు మంత్రి ఉపాధ్యాయురాలిని అభినందించారు.

డ్రగ్స్ వాడకం చట్టరీత్యానేరం : సీఐ

బాపట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి హానికరమని, చట్టరీత్యా తీవ్రమైన నేరమని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. బాపట్ల శక్తి సబ్ డివిజన్ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం సరస్వతీ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల సమాజానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరు బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శక్తి టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివునికి ఏకాదశి రుద్రాభిషేకం

కర్లపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అయ్యప్పస్వామి దేవాలయంలోని శివాలయంలో బుధవారం కార్తికమాసంను పురస్కరించుకొని దేవదాయ అర్చకస్వామి పరిమి దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో 15 మంది పురోహితులు శివునికి ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకంలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పెనుమెత్స శ్రీనివాసరాజు, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, నాయుడు వెంకటనారాయణ, గాజుల శ్రీనివాసరావు, అట్ల వేణు మోహన్‌రెడ్డి, మెడతాటి గిరి, కట్టా సుజాత పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దుతున్న కూటమి ప్రభుత్వం

● వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుబిడ్డగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దడానికి సరికొత్త విధానాలను అమలు పరుస్తున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. చుండూరులో అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధుల విడుదల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ, విజనరీ ముఖ్యమంత్రిగా ప్రపంచ గుర్తింపు పొందిన చంద్రబాబు వ్యవసాయ రంగంలో కూడా అనేక నూతన ఉరవడులతో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా రూపొందించడానికి అగ్రిటెక్ విధానంలో ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వంలో సాగుకు నీరందక పంటలు ఎండిపోయిన పరిస్థితులు నెలకొన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సాగు, మురుగు నీటి కాల్వలు బాగు చేయించి సకాలంలో రైతుకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. చుండూరు మండలంలో అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులతో 5,461 లబ్ధి పొందారని రూ.3.60 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, బాలకోటిరెడ్డి, ఎల్లారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, వీఎస్‌కె ప్రసాద్, కంఠంనేని రాహుల్, కావూరి శ్రీనివాసరావు, శ్రీమాన్, దేవిరెడ్డి నాగేశ్వరరావు, ముక్కామల వేణు, శరత్, ఎంపీడీవో సునంద, తహసీల్దార్ నాగరాజు, ఎం.ఆదాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : జేసీ



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జేసీ భావన

చెరుకుపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని జాయింట్ కలెక్టర్ భావన అన్నారు. చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ భావన మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అన్నారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ రేపల్లె నియోజకవర్గస్థాయిలో 28,634 మంది లబ్ధిపొందారన్నారు. మొత్తం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద రూ.18.81 కోట్ల నగదు విడుదల కావటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి ఛైర్మన్ పంతాని మురళీధరరావు, రేపల్లె మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎం.అనూరాధ, జడ్పీటీసీ ఎం.పావని, మండల స్థాయి నాయకులు, ఏపీసీఎస్ఎఫ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, అభ్యుదయ రైతులు, రైతులు పాల్గొన్నారు.

పేటేరు గ్రామంలో...



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం రెండోవిడత నిధుల విడుదల జరిగినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ బుధవారం తెలిపారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలో నిధులు విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో రవిబాబు పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు రూ.7,000 నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతుందని తెలిపారు. ఎంపీడీవో రవిబాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటుందన్నారు. ఏవో మాట్లాడుతూ రేపల్లె మండలంలో 7,852 రైతు కుటుంబాలకు రూ.5 కోట్ల 18 లక్షలు రెండో విడతగా జమ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రవి కిరణ్, ఎంపీటీసీ ప్రభాకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, అభ్యుదయ రైతులు, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

అమృతలూరు మండలంలో...

అమృతలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ రైతులకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రైతులకు బుధవారం రెండో విడత అన్నదాత సుఖీభవ పథకం కింద 5533 రైతులకు రూ.2.77 కోట్లు పీఎం కిసాన్ పథకంలో 4561 మంది రైతులకు రూ.91 లక్షల నిధులు మొత్తం రూ.3.68 కోట్ల నిధులు విడుదలైనట్లు ఏవో చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు విద్యారంగంలో రాణించాలి

● ఏవీవీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి

బాపట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : బాలికలు విద్యారంగంలో రాణించి వారి ఉన్నతికి మార్గాన్ని అన్వేషించుకోవాలని ఎవివి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతి అన్నారు. బాపట్లశాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి ముఖ్యఅతిథిగా పాల్గొని ఇందిరాగాంధీ జీవితచరిత్రను బాలికలకు వివరించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.శివాజిగణేశన్, జి.వెంకటేశ్వరరావు, ఎం.దుర్గ, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. భట్టిప్రోలు శాఖా గ్రంథాలయంలో బుధవారం వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, మహిళలు స్వయంగా ఎదగాలంటే విద్య ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు నిర్వహించిన నీతి కథలు పోటీలను పర్యవేక్షించారు. కొల్లూరు శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి మండల పరిషత్ కార్యాలయం ఏవో మహాలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతవరం శాఖా గ్రంథాలయంలో జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు బి.రత్నకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు కె.సుభాష్‌చంద్రబోస్, వై.రాంబాబు, జి.కనకదుర్గ, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● అమృతలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రం అమృతలూరు, కూచిపూడి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ముగ్గులు పోటీలు జరిపారు. ఏర్పాట్లను గ్రంథాలయాధికారి రాఘవేంద్రరావు, శ్రీదేవి పర్యవేక్షించారు.

● కర్లపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయ ఆవరణలో విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ విద్యార్థినీ, విద్యార్థులకు హెల్త్ డిపార్ట్‌మెంట్ వారిచే ఆరోగ్య సూచనలు తెలియజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం రైతు సేవా కేంద్రంలో బుధవారం 2025-2026 సంవత్సరానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవికృష్ణమూర్తిరాజు ప్రారంభించారు. కార్యక్రమానికి ఖాజీపాలెం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మెండు శివపార్వతి కిషోర్ అధ్యక్షత వహించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ సత్యానంద్, డీలర్‌ల సంఘం అధ్యక్షుడు దండు శివరామరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు నాగలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల చందోలు గ్రామపంచాయతీలోని జుల్ఫా వీధికి చెందిన బాజీ బేగ్ పూరిల్లు దగ్ధం కావటంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు సయ్యద్ నిజాం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. నిజాం మాట్లాడుతూ ఎమ్మెల్యే నరేంద్రవర్మ స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యకర్తలు షేక్ బాజి, అమీరా, సలీం, అన్వర్‌బేగ్, గౌస్‌బేగ్, జాకీర్, తాజు పాల్గొన్నారు.

పాడి రైతులకు దాణా పంపిణీ

పిట్టలవానిపాలెం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో పాడి రైతులకు బుధవారం పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్ పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చందోలు-2 నీటి సంఘం అధ్యక్షుడు, బీసీసీ ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఎండీ రజాక్, అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమారి, జేవీవో వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దు : ఎంపీడీవో

నగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : దళారులను నమ్మి తమ ధాన్యాన్ని తక్కువ రేటుకు అమ్ముకోవద్దని నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన బోరమాదిగపల్లిలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రభుత్వం అందించే మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్మి లబ్ధిపొందాలని కోరారు. అంతేకాకుండా రైతుసేవాకేంద్రాల ద్వారా అమ్ముకున్న ధాన్యానికి 48 గంటల్లోపే తమ నిధులు జమ అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బెల్లంవారిపాలెం సర్పంచ్ పరిశా శివరామ్‌బాబు, వీఆర్‌వో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతుసేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జంపని విద్యార్థుల కోటప్పకొండ అవగాహన యాత్ర

వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన యాత్రలో భాగంగా బుధవారం ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రాన్ని, కోటప్పకొండ ఆలయం పరిసర ప్రాంతాలను సందర్శించారు. సమగ్ర శిక్ష ద్వారా విడుదల చేసిన నిధులతో ఈ విహార యాత్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు బదరీ నారాయణ తెలిపారు. ఆయా ప్రదేశాలను సందర్శించిన విద్యార్థులు అనేక ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, సామాజిక పరమైన విషయాలను గ్రహించే విధంగా ఉపాధ్యాయులు ప్రాంతాల విశేషాన్ని వివరించారు. చక్కగా అనుభూతిని పొందినట్లు విద్యార్థులు ఆనందం వ్యక్తపరిచారు. ఈ అవకాశం కల్పించిన సమగ్ర శిక్ష విభాగానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యమ్మ, ప్రకాష్, మధుమయి, రాంబాబు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రక్షణ సైన్యం ప్రతినిధులు

కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరులంకలో బుధవారం అంతర్జాతీయ రక్షణ సైన్యం ఎమర్జెన్సీ డిజాస్టర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ నాయకులు కమిషనర్ దాసరి దానియేలురాజు ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకతోటి శ్రీకాంత్, రక్షణ సైన్యం తెనాలి నాయకులు లెఫ్ట్ కల్నల్ గేరా థామస్ బృందం, చెన్నైకు చెందిన మేజర్ ప్రభాత్‌కుమార్, కెప్టెన్ రమేష్, జీవన్‌రాయ్, మేజర్ రవిమోజస్, మేకతోటి శరత్, ప్రవీణ్, సంఘ పెద్దలు, సంఘ కాపరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి క్షీరాభిషేకం



వీరభద్రునికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీరామేశ్వరాలయంలో కొలువుదీరిన శ్రీవీరభద్రస్వామికి కార్తిక మాస కృష్ణపక్షం చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకుని క్షీరాభిషేకం చేశారు. పండిత మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయ శర్మ నమక చమకాలు రుద్రం పంచసూక్తాలతో అభిషేకం నిర్వహించి వీరభద్ర అవతార విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రవచనం చెబుతున్న ప్రజ్ఞానంద సరస్వతి స్వామి

లలిత సహస్రనామ పారాయణం సకల శుభప్రదం

● పెనుకొండ క్షేత్ర పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి

అమృతలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లలిత సహస్రనామ పారాయణం సకల శుభప్రదం అని పెనుకొండ క్షేత్ర పీఠాధిపతులు ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) అన్నారు. పవిత్ర కార్తిక మాస అమావాస్యను పురస్కరించుకొని బుధవారం మండలంలోని గోవాడ శ్రీ పార్వతీ సమేత బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక లలితా సహస్రనామ పూజ, కోటి కుంకుమార్చన హోమం జరిపారు. గుంటూరు, కృష్ణా జిల్లా అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు(వాసు) సహకారంతో జరిగిన కార్యక్రమానికి ప్రజ్ఞానంద సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, ఆ జగన్మాత పరాశక్తి పరమేశ్వరి నామాలను సహస్ర నామాలుగా ఇంతమంది మహిళలు ఈ క్షేత్రంలో పారాయణ చేయడం మన అందరి అదృష్టం అన్నారు. పూజా కార్యక్రమాలను గడ్డిపాటి శ్రీనివాసరావు, ఉమారాణి దంపతుల చేతుల మీదగా ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటశ్రీనివాసశర్మ నిర్వహించారు. ఆలయ అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ హేమ శంకరరావు, చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

సాగునీటి కాల్వలకు ఉపయోగపడుతున్న ఉపాధి నిధులు

● టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య



కుచ్చెళ్లపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీవో సత్యకృష్ణ

వేమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిర్వహణలో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు సాగునీటి కాల్వల మరమ్మతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, తద్వారా పైర్లకు సకాలంలో సాగునీరు అందించుకునే అవకాశం ఏర్పడుతుందని కుచ్చెళ్లపాడు సర్పంచ్, టీడీపీ మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని కుచ్చెళ్లపాడు, వరహాపురం గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు తీర్మానంపై బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఏపీవో సత్యకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, రైతుల కోరిక మేరకు కాల్వల పూడికలు తీయించాలని, వారి ఆమోదంతోనే పనులు గుర్తించి తీర్మానాలు చేయాలని అధికారులను కోరారు. వరహాపురంలో 59 పనులకు, కుచ్చెళ్లపాడులో 62 పనులకు గ్రామస్థుల ఆమోదంతో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వరహాపురం సర్పంచ్ యల్లమాటి స్వాతి, కార్యదర్శులు సాధిక్ ఆలీ, స్టాలిన్, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రజాదర్బార్

భట్టిప్రోలు, కొల్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఉదయం జరిగే కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యలకు పరిష్కారం చేపట్టిన అధికారులు



తాగునీటి పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అమృతలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత వారంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నిర్వహించిన ప్రజా వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ప్రజావేదికలో ఉత్తర ఎస్సీ కాలనీకి పైపు లైన్ పగిలిపోయి తాగునీరు సక్రమంగా రావడంలేదని, బాడవ డొంకలో చెట్టు అడ్డంగా పడి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, అమృతలూరులోని కమ్యూనిటీ భవనం ఫ్లోర్ కుంగిపోయిందని, ఆవరణ అంతా పిచ్చి చెట్లతో అడవిని తలపిస్తుందని గ్రామస్థులు అర్జీలు అందజేశారు. దీంతో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పార్టీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్, సర్పంచ్ రాములు తగు చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీకి కొత్త పైపులైన్ వేయడంతోపాటు, కమ్యూనిటీ భవనంలో పిచ్చి మొక్కలు తొలగింపు, కుంగిపోయిన ఫ్లోర్ తిరిగి పునరుద్ధరించడం, డొంకలో అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు వంటి చర్యలను చేపట్టారు.

అనధికార నిర్మాణాలు క్రమబద్ధీకరించుకోవాలి : కమిషనర్

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనధికార, ప్లాట్స్ క్రమబద్ధీకరణకు ఇదే చివరి అవకాశం అని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. 1985 నుంచి 2025 వ సంవత్సరం వరకు అనుమతులు తీసుకోకుండా చేపట్టిన అనధికార కట్టడాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 120 రోజుల్లోగా ఆన్‌లైన్‌లో లైసెన్స్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు రిజిస్ట్రార్ దస్తావేజులు, సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన ఈసీ, మార్కెట్ విలువ కాపీ, భవనం ఫొటో, ప్లాన్, ఇతర సంబంధిత పత్రాలతో ప్రాథమిక ఫీజు రూ.10 వేలు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

రేపల్లె బ్రాంచ్‌కి ఐఎంఏ రాష్ట్రస్థాయి అవార్డు

రేపల్లె, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రేపల్లె బ్రాంచ్ కి 2024-25 సంవత్సరంలో చేసిన సీఎంఈ ప్రోగ్రామ్స్‌కి రాష్ట్ర శాఖ అవార్డు ప్రకటించింది. గుంటూరు, విజయవాడలోని ప్రసిద్ధ హాస్పిటల్స్ సౌజన్యంతో కార్యక్రమాలు జరిగాయి. రాబోయే కాలంలో ఐఎంఏకి మరిన్ని అవార్డు రావాలని ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య తెలియజేశారు.

రక్తికట్టిన రాచగావు

ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు



కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారా ధన ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారిని ఆయన ఇంటి దగ్గర నుంచి వీరాచార వంతులు ఊరేగింపుగా వీర్ల దేవాలయానికి తీసుకొచ్చారు. పలు జిల్లాల నుంచి వచ్చిన వీరాచార వంతులు తమ ఆయుధాలను నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి నూతన వస్త్రాలను అలంకరింపజేసి వీరుల ఆలయంలో ఉంచి పూజలు జరిపారు. పూజల అనంతరం పీఠాధిపతి కోటగోడ ముఖద్వారంపై ఎర్రజెండా ఎగరవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆనాడు మాచర్ల, గురజాల రాజులు యుద్ధానికి సిద్ధం కమ్మని యుద్ధభూమిలో ఎర్రజెండా ఎగరవేయడాన్ని సూచికగా పీఠాధిపతి ఎర్రజెండాను ఎగరవేశారు. అనంతరం రాచగావు మంటపంలో పీఠాధిపతిని కంకణధారిని చేశారు. మేకపోతును గావు పట్టినట్టు నాటకీయంగా నిర్వహించారు. వీరావిద్యావంతులు మంటపంలో రాచగావు కథను గానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, గ్రామ పెద్దలు, వీరాచారవంతులు పాల్గొన్నారు.


పల్నాటి చరిత్ర ఘనమైంది

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పల్నాటి చరిత్ర ఎంతో ఘనమైందని, ఇక్కడి చారిత్రక చిహ్నాలను భద్రపరిచి భావితరాలకు అందిద్దామని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం కారంపూడిలో వీరారాధన ఉత్సవాలలో ఆయన హాజరై అంకాళమ్మ, చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 1184లో జరిగిన పల్నాటి యుద్ధానికి శైవ, విష్ణు మతాల సంఘర్షణే కాకుండా రాజ్యకాంక్ష, దాయాదుల పోరు దాగి ఉందన్నారు. మహాభారతంలో పాచికల ఆటలో రాజ్యాన్ని పోగొట్టుకొని పాండవులు అరణ్య వాసానికి వెళ్లినట్లే, కోడి పందేలలో నాగమ్మ కుయుక్తులతో ఓడి మాచర్ల రాజ్యాన్ని వదిలి మలిదేవరాజు అరణ్య వాసానికి వెళ్లారన్నారు. ఆనాటి రాజులు యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకొని 18 రోజులపాటు ఉద్యమం సాగించి వీరులయ్యారన్నారు. ఆ వీరులకే ఉత్సవాలు జరపడం కొన్ని వందల సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి తపస్సుకు వెళుతూ బ్రాహ్మణులైన పిడుగు వంశం వారిని పీఠాధిపతులుగా వంశపారపర్యంగా నిర్ణయించి వెళ్లడంతో వారే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి వెంట గురజాల డీఎస్పీ జగదీష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, కజ్జం సైదయ్య, కొమెర అనంతరాములు, బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, కర్నా సైదారావు, బూసా రామాంజనేయులు, సర్పంచ్ సరస్వతి బాలు నాయక్, ఉన్నం లక్ష్మినారాయణ, బొమ్మిన శేషగిరిరావు, కలికల బాలకృష్ణ, తోట అల్లయ్య, ఎస్‌పీఆర్ కృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వాసు తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



బై.. బై.. అమెరికా

అమెరికాలో విదేశీ ఉద్యోగులపై ఆంక్షలు, వీసా నిర్ణయాల్లో మార్పులు, చిన్నా చితక తప్పులకు కూడా కఠిన చర్యలు.. ఈ పరిస్థితులు ఎన్నో భారతీయ కుటుంబాలను మరోసారి ఆందోళనలోకి నెడుతున్నాయి. అమెరికా ఉద్యోగ ప్రపంచం కలలను నెరవేర్చుకో వాలనుకున్న వేలాది మందిలో పల్నాడు, గుంటూరు జిల్లాకు చెందిన కొందరు యువకులు గత కొన్నేళ్లుగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడే ఆలోచనలో ఉన్నారు. కానీ వీసా ప్రమాణాలపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న కఠిన నియమా లు, చిన్న తప్పుకి కూడా కఠినంగా స్పందిస్తున్న ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరు వారి కలలను తలకిందులు చేసింది.

● చిన్న తప్పులకు పెద్ద శిక్షలు వేస్తున్న అగ్ర దేశం
● ఆందోళనతో స్వదేశానికి తిరిగి వస్తున్న యువత
● అమెరికా ప్రభుత్వ నిర్ణయాలతో తలకిందులైన జీవితాలు
● తల్లిదండ్రుల్లో ఆవేదన.. యువతలో ఆందోళన
● భవిష్యత్తుపై అంతులేని మదనంలో యువకులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

అమెరికాలో వీసా పొడిగింపులు, నియమావళిలో మార్పులు, ఉద్యోగ ధ్రువీకరణలో ఏ చిన్న లోపం ఉన్నా అది పెద్ద సమస్యగా మారుతోందని అక్కడి ఇండియన్ కమ్యూనిటీ చెబుతోంది. దరఖాస్తుల్లో చిన్న వివరాలు తప్పిపోయినా, ప్రాజెక్టు వివరాలు మ్యాచ్ కాకపోయినా, అదనపు స్పష్టీకరణ ఇచ్చినప్పటికీ వీసాలు రద్దు కావడం వంటి అనుభవాలతో చాలామంది భారతీయులు స్వదేశం చేరుతున్నారు. ఉద్యోగంలో మార్పులు, కంపెనీ డాక్యుమెంటేషన్‌లో చిన్న అస్పష్టత, వర్క్ పర్మిట్ రెన్యువల్‌లో ఆలస్యం వంటి ఈ చిన్న విషయాలే పెద్ద సమస్యగా మారి, వారి వీసాలు ప్రశ్నార్థక స్థితికి చేరాయి. చివరకు వారికి స్వదేశం రావడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

పెరుగుతున్న తిరిగొస్తున్న వారి సంఖ్య

ఇటీవలి నెలల్లో వీసా ప్రక్రియ కఠినతరం కావడంతో అమెరికా నుంచి భారత్ తిరిగొస్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతోందని ఇండియన్ కమ్యూనిటీ అసోసియేషన్లు చెబుతున్నాయి. కొంత మందికి వీసా రెన్యువల్‌లో సమస్యలు, మరికొంత మందికి ఉద్యోగ మార్పుల కారణంగా డాక్యుమెంటేషన్ ఇష్యూలు, మరికొందరికి ఇమ్మిగ్రేషన్ వేలిముద్రలు, అడ్రస్ అప్‌డేట్స్ వంటి చిన్న పొరపాట్లే పెద్ద అడ్డంకులుగా మారుతున్నాయి. ట్రంప్ పాలసీల ప్రభావం, అక్రమ వలసలపై మరింత కఠిన వైఖరి, ఇవి కలిపి చాలా మంది భారతీయులకు అస్థిరత కలిగిస్తున్నాయి. అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులే కాక, ఐటీ, హెల్త్‌కేర్, రీసెర్చ్ రంగాల్లో పనిచేసే చాలా మందికి వీసా నిర్ణయాలు ఇప్పుడు భయం కలిగిస్తున్నాయి. ఇక ముందేమవుతుందో తెలియని పరిస్థితి కన్నా స్వదేశం వస్తేనే మనసు ప్రశాంతంగా, తాము సురక్షితంగా ఉండగలమని పలువురు భావిస్తున్నారు.

● విద్యా రుణం సంగతి...

పిల్లలు విదేశాలకు వెళ్తున్నారన్న ఆనందంతో తల్లిదండ్రులు బ్యాంకుల్లో రూ. లక్షలు విద్యారుణం తీసుకున్నారు. అక్కడ ఏదో ఒక ఉద్యోగం చేసి ప్రతి నెల ఎంతో కొంత జమ చేసేవారు. ఇప్పుడు పూర్తిగా ఇంటికి వచ్చేస్తే అన్న ప్రశ్నకు ఇటు తల్లిదండ్రులు, అటు యువకుల వద్ద సమాధానం లేదు. ఉన్న ఆస్తిని అమ్మి ఆ రుణం చెల్లిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలు తమ కళ్ల ముందుంటే చాలని అంటున్నారు. అదీ నిజమేగా దేశం కాని దేశంలో పొరపాటున ఇరుక్కు పోతే చచ్చేంత పని అవుతుంది. అటువంటి ఆపద రాక ముందే మేలుకుంటే మంచిదే కదా..!

● నీరు గారిన ఆశలు

అమెరికాలో స్థిరపడాలన్న ఆశలు నీరుగారి అక్కడి నుంచి భారతదేశానికి తిరిగొచ్చిన యువకుల కుటుంబాల్లో తీవ్ర ఆవేదన కనిపిస్తుంది. అదే సమయంలో పిల్లలు తమ దగ్గరలోనే ఉన్నారనే ధైర్యం వారిలో ఉంటోంది. ఇలా రెండు రకాల భావోద్వేగాల మధ్య పెద్దలు నలిగిపోతుంటే.. మళ్లీ విదేశాల్లో ఉద్యోగం సాధించాలా? లేక ఇక్కడే కొత్త అవకాశాలు వెతుక్కోవాలా? అన్న ప్రశ్నలతో యువకులు కొత్త జీవన ప్రణాళికలు రచిస్తున్నారు.

రాగిశాసనంలో...శ్రీశైలం మెట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)



ఏఎస్ఐ డీకోడింగ్ చేసిన రాగిశాసనం ఇదే

రాగి శాసనాలను డీకోడింగ్ చేయగా శ్రీశైలం ఆలయానికి మెట్లు నిర్మించినట్లు కూడా దానిలో ఉందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(మైసూర్) మునిరత్నం రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారంలో వెలుగు చూసిన రాగి శాసనాలను సదరు వంశీయులు ఏఎస్ఐకి పంపిన సంగతి తెలిసిందే. చారిత్రక శాసనాలను డీకోడింగ్ చేసే క్రమంలో వాటిలో అనేక ఆసక్తి కరమైన అంశాలు లిఖించి ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపింది. ప్రసిద్ధి చెందిన శ్రీశైలం మల్లికార్జున ఆలయానికి మెట్ల నిర్మాణం అంశం కూడా దానిలో పొందుపరచడం జరిగిందన్నారు. ఇదే కాకుండా రెడ్డి రాజుల వంశ వృక్షం వివరాలను కూడా అందులో వివరించారని, మొత్తం సంస్కృతం, తెలుగు లిపిలోనే ఇవన్నీ లిఖించారన్నారు. వేద పండితులంతా కలిసి ఈ శాసనాలను 1,405 శతాబ్దంలో అప్పటి రెడ్డి రాజులకు అందించారని, వాటిని ఆ వంశీయులు భద్రపరచి ఆర్కియాలజీ విభాగానికి అందించడం వల్ల అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని ఏఎస్ఐ తెలిపింది. పొన్నపల్లి అగ్రహారానికి చెందిన విద్యా భాస్కర్ అందించిన చారిత్రకక రాగి శాసనాలపై మరింతగా కసరత్తు చేస్తున్నామని డైరెక్టర్ మునిరత్నంరెడ్డి వివరించారు.

ప్రకాశం బ్యారేజీ దిగువకు 400 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 9,293 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,154, పశ్చిమ డెల్టాకు 4,513, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం..

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 585.50 అడుగులు ఉంది. ఇది 298.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేలు, ఎడమ కాలువ ద్వారా 4,160, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 14,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 14,760 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 41.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేలు, లీకుల ద్వారా 400, మొత్తం 2,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

లెక్కే లేదు..అమలు ఇంకెక్కడ?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో కమిటీలు వేసి చేతులు దులుపుకుంటే, చాలా మున్సిపాలిటీల్లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కల లెక్కే సరిగా లేదంటే.. ఉత్తర్వుల అమలు తీరు ఏమేర ఉందనేది అర్థమవుతోంది.

శిథిలావస్థలో కేంద్రాలు..

స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్‌కు అవసరమైన కేంద్రాలు అందుబాటులో లేవు. ఉదాహరణకు తెనాలి పట్టణానికి సంబంధించి వ్యాక్సినేషన్, సంరక్షణ కేంద్రాన్ని రూ.12 లక్షలతో ఏడేళ్ల క్రితం కంపోస్టు యార్డులో నిర్మించారు. దీనిని సరిగా వినియోగించకపోవడంతో షెడ్‌లు శిథిల స్థితికి చేరాయి. పరికరాలు కూడా పనికి రాకుండా పోయాయి. ఇదే పరిస్థితి మిగిలిన మున్సిపాలిటీల్లోనూ ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో అసలు కేంద్రాలే ఏర్పాటు కాలేదు. ఉన్న కేంద్రాల్లో డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకం లేదు.

కమిటీలు ఇలా..

సుప్రీం ఆదేశాల మేరకు.. శునకాల నుంచి పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక సంస్థలు వెల్లడించాలి. ఫిర్యాదులను తీసుకుని.. తక్షణం స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నిబంధనల అమలు కోసం ఆరుగురు సభ్యులతో కమిటీ వేయాలి. పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి సభ్యులను నియమించాలి. ఈ కమిటీలకు పురపాలికల్లో కమిషనర్, పంచయతీల్లో కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు.


- తెనాలి పట్టణంలో 1,450 వీధి కుక్కలు మాత్రమే ఉన్నాయనడం ఆశ్చర్యం కలిగించే విషయం. వీటిలో 350 కుక్కలకు మాత్రమే ఆపరేషన్లు చేయాలని ఒక లెక్క చెబుతోంది. అసలు స్టెరిలైజేషన్ పనిచేయకపోతే ఏ విధంగా మిగిలిన వాటికి వ్యాక్సిన్, ఆపరేషన్‌ల ప్రక్రియ పూర్తిచేశారనేది సందేహం.
- సత్తెనపల్లి మునిసిపాలిటీ పరిధిలో రెండు వందలకు పైగా కుక్కలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. మరో ఆరు వందల వరకు కుక్కలు రోడ్లపై తిరుగుతున్నాయి. సుప్రీం ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి ఆపరేషన్ థియేటర్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచేందుకు షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ నెల చివరిలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందగానే నిర్మాణ పనులు ప్రారంభించ నున్నట్లు అధికారులు తెలిపారు.
- నరసరావుపేట మునిసిపాలిటీ పరిధిలో సమూరు 450 కుక్కలను మునిసిపాలిటీ అధికారులు గుర్తించారు. ఇప్పటికి 165 కుక్కలను పట్టి వాటికి స్టెరిలైజేషన్ చేశారు. అనంతరం వాటిని తిరిగి వాటి అసలు స్థానాల్లోనే వదులుతున్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు.
- బాపట్లలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు రైలుపేట స్మశానవాటికలో శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. రూ.6 లక్షలు వెచ్చించి షెడ్, బోన్‌లు, ఏసీ, ఆపరేషన్ పరికరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 1000 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 800 కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయినప్పటికి సూర్యలంక రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, జీబీసీ రోడ్డు, జమ్ములపాలెంరోడ్డు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్‌ను వివరణ కోరగా స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- అద్దంకి పట్టణంలో 420 కుక్కలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం వరకు 96 కుక్కలను సత్తెనపల్లికి పంపినట్లు మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. వారం రోజుల్లో అన్నింటిని పట్టుకొని వ్యాక్సినేషన్ చేయిస్తామన్నారు. అయితే స్థానికుల నుంచి అభ్యంతరాలు వస్తుండటంతో ఒకింత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. గ్రామాలలో మాత్రం అధికారులు అసలు పట్టించుకోవడం లేదు.



బాపట్ల : రైలుపేట స్మశాన వాటిక దగ్గర వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక శిబిరం

గజ.. గజ...

● ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలి తీవ్రత ● ఆస్తమా రోగులు, వృద్ధులు, చిన్నారుల అవస్థలు ● అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సత్తెనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో వారం రోజులుగా చలి తీవ్రత అధికమైంది. చలి తీవ్రతతో ప్రజలు గజగజ వణికి పోతు న్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజులు ఎలా ఉంటాయోనని భయపడు తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న చలి గాలులతో అడుగు బయట పెట్టలంటేనే జంకుతున్నారు. చలి తీవ్రతతో వృద్ధులు, పిల్లలు, ఆస్తమా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పొగమంచుతో కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● రోగుల వెతలు

చిన్నారులు, వృద్ధులతో పాటు ఆస్తమా రోగులు ఓ వైపు చలికి, మరో వైపు పొగ మంచు ప్రభావంతో అల్లాడి పోతున్నారు. ఆస్తమా, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఆయాసం కేసులు పెరుగుతున్నాయి. సీఓపీడీ, అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాస కోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్‌లు త్వరగా దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. పొగ మంచు ఫలితంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అత్యవసరమైతే తప్ప వాహనాలతో బయటకు వెళ్ళకూడదని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారిలో రోజంతా తిరుగాడే వాహన డ్రైవర్లు మాత్రం జాగ్రత్తగా ముందుకు వెళ్ళాలన్నారు. రాత్రి పొద్దు పోయాక మంచు దట్టంగా కురిసే సమయంలో పెద్ద వాహనాలను నిలిపి వేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలతో ప్రయాణించ కూడదని చెబుతున్నారు. చల్లటి గాలులకు శరీరం చల్లగా పొడి బారినట్టు మారిపోతుంది. పెదాలు పగిలిపోయి మొఖం కాంతిహీనంగా తయారవుతుంది. అరికాళ్ళ పగుళ్ళు ఏర్పడతాయి. శరీరంలో తేమ శాతం తగ్గటంతో చర్మ రక్షణ తగ్గి దురదలు వస్తాయి. ఈ తరహా సమస్యలు దీర్ఘకాలిక రోగుల్లో మరింత ఎక్కువగా కన్పిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పుతో వారం నుంచి రెండు వారాల పాటు ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని వారు అంటున్నారు. న్యుమోనియా, ఆస్తమా, సీఓపీడీ, గుండె వ్యాధులతో బాధ పడే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా సమస్య పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని పేర్కొంటున్నారు. కాగా, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు అక్టోబరు నెలలో జలుబు, దగ్గు, జ్వరం, ఆస్తమా సమస్యలతో 800 మంది వరకు రోగులు చికిత్స నిమిత్తం వచ్చారు.

● జాగ్రత్తలు తప్పనిసరి



చలి కాలంలో చిన్న పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్ళల్లో ఉష్ణోగ్రత్తలు తక్కువగా ఉంటే పిల్లలు శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉంటుం ది. మంచుపడే సమయంలో పిల్లలను బయటకు తీసుకు వెళ్లొద్దు. తప్పనిసరైతే స్వెట్లర్లు, మంకీ క్యాపులు వాడాలి. ఇన్‌ఫెక్షన్‌లు సోకే అవకాశం ఉంటుంది. పిల్లల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తరచూ జలుబు, దగ్గు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి

-డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల వైద్యులు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

● వేడి నీరు తాగాలి



ఆస్తమా రోగులు, చెవి, ముక్కు, గొంతు సమస్యలతో ఉన్న వారు చలి కాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడి చేసి వడబోసుకొని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతు నొప్పి ఉన్న వారు రోజుకు రెండు సార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కలించి ఉమ్మి వేయాలి.

-డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి

గర్భిణీలు జాగ్రత్తలు తీసుకోవాలి



చలి తీవ్రత పెరుగుతున్నందు వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో మహిళల్లో హార్మోన్లపై ప్రభావం పడుతుంది. థైరాయిడ్, ఎలర్జీ ఉన్న వారికి ఇది మరింత సమస్యగా ఉంటుంది. గర్భిణీల్లో బీపీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు బీపీ చెకప్ చేయించుకోవాలి. ప్రసవించిన మహిళలు వేడి నీరు ఎక్కువగా తీసుకోవాలి. సూర్యరశ్మి కనీసం 20 నిమిషాలు శరీరానికి తగిలేలా చూడాలి.

- డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి